# పరిమళం

స్సాయంత్రం ఏడుగంటలు కావస్తోంది. సావిత్రి తులసికోట దగ్గర కూర్చుని నానిగాడికి అన్నం కలిపి పెట్టడానికి ప్రయత్నం చేస్తోంది.

"ఊఁ-నా కంచులో వద్దు"

"ఎందులో కలపను?"

"చిన్న కంచంలో కలుపు."

సావిత్రి పెద్ద కంచంలోంచి చిన్న కంచంలోకి అన్నం మార్చింది.

మళ్ళీ మొదలు.

"అదీ వద్దు"

"మరేం కావాలి?"

"వెండి గిన్నెలో కలుపు"—

విసుగ్గా లేచి "అబ్బబ్బ! చంపుకు తింటున్నావురా" అనుకుని వెండి గిన్నెలో అన్నం కలిపింది.

"ఈ గిన్నెలో కాదు నే చెప్పింది."

"మరేది?"

"పువ్వులు పువ్వులుగా వుంటుందే..."

"నా శ్రాద్ధం - అసలు నీకు అన్నం కావాలా వద్దా" అంది విసుగ్గా.

"కావాలి"

"మరి తిను."

"తినను."

"ఎందుకు।"

"నాకు గ్లాసులో పాలుపోసి, అందులో అన్నంవేసి, పంచదార వేసి—"

వాడి మాట పూర్తి కాకుండానే వీపు విమానంమోత మోగింది.

ఏడుపు మొదలు—

చేసేదిలేక సావిత్రి మళ్ళీ పువ్వులున్న గిన్నెలో అన్నం కలిపింది.

"నాకు గిన్నెలో వద్దు. గ్లాసులో అన్నంవేసి, పాలూ పంచదారా-"

ఈసారి సావిత్రి చెయ్యి పైకి లేచింది.

"ఆగు" అన్నాడు సుబ్బారావు. సావిత్రి ఆగి చూసింది. ఈ గొడవలో భర్త ఎప్పుడొచ్చాడో కూడా గమనించలేదు. సుబ్బారావు చేతిలో వున్న బరువైన ఆఫీసు రిజిష్టర్లు పక్కనపెట్టి నానిగాడిని ఎత్తుకుని ముద్దులు పెట్టేసుకున్నాడు. సావిత్రి ఆశ్చర్యంగా విసుగ్గా గిన్నె నేలమీద పెట్టి-

"బాగుంది ముద్దు. ముక్కలైనట్లుంది" అంది మూతి తిప్పుతూ.

"ఇంకెప్పుడూ వాడిని కొట్టకు" అన్నాడు.

"దేనికీ సంతృప్తి లేదు. అదంటే యిది. ఇదంటే అది. ఏది చేసినా ఇలా కాదు. మరోలా అంటాడు. ఎంత చేసినా ఆ ముఖాన నవ్వు చూడలేకుండా వున్నాను" అంది.

"ఆ లక్షణాలు ఎంత గొప్పవో తెలుసా. ఏం చేసినా, ఎలా చేసినా సంతృప్తి పడకపోవడం ఆఫీసరు లక్షణం. అలాంటి ఉన్నతమైన గుణాలు పుట్టుకతోనే వున్నాయంటే వీడు తప్పక ఆఫీసరవుతాడు. మరెప్పుడూ వీడ్ని కొట్టకు" అని నానిగాడిని ముద్దు పెట్టుకుని కిందకిదించి బరువైన రిజిష్టర్ల కట్టకేసి బరువుగా చూసి నిట్టూర్చాడు సుబ్బారావు.